
సాక్షి
గుంటూరు
మంగళవారం । 8 । ఆగస్టు । 2023



డెల్టాకు 3,007 క్యూసెక్కులు

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 3,007 క్యూసెక్కులు విడుదల చేశారు.



దుర్గమ్మ సేవలో మంత్రి గుమ్మనూరు

విజయవాడ: రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సోమవారం దర్శించుకున్నారు.

ఏపీ అడ్వకేట్స్ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా క్రాంతికుమార్



విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా డి.క్రాంతికుమార్‌ను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌కుమార్ తెలిపారు. 11 నుంచి 14వ తేదీ వరకు బెంగళూరులో జరిగే సౌత్ ఇండియా అడ్వకేట్స్ టోర్నమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ

బాపట్ల: బాపట్ల జిల్లాలో నిలిచిపోయిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్ల ప్రక్రియను మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు డీపీఓ దాసరి రాంబాబు సోమవారం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నామినేషన్లను ఆయా పంచాయతీ కార్యాలయాల్లో స్వీకరించనున్నట్లు చెప్పారు. పోలింగ్ 19వ తేదీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలోని 32 గ్రామ పంచాయతీలకు గాను 35 వార్డులకు సభ్యుల ఎన్నిక ఉంటుందని తెలిపారు. జిల్లాలోని ఇంకొల్లు మండలం పావులూరు సర్పంచి పదవికి, చుండూరు మండలం మున్నంగివారిపాలెం గ్రామ సర్పంచి పదవికి ఎన్నిక నిర్వహించనున్నట్లు వివరించారు.

యార్డుకు 28,052 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 28,052 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 26,196 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.14,500 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,030 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

10 నుంచి సీఎల్ఐఎస్సీ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పరీక్షల విభాగ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు సీఎల్ఐఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం తెలిపారు. గుంటూరు బ్రాడీపేట 2/14లోని శ్రీశారదానికేతన్ ఓరియెంటల్ స్కూల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

డీఎడ్ మూడో సెమిస్టర్..

2021–23 బ్యాచ్ డీఎడ్ మూడో సెమిస్టర్ పరీక్షలు గుంటూరులోని సెయింట్ జోసఫ్ బాలికోన్నత పాఠశాలలో ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ శైలజ తెలిపారు. అదే విధంగా డీఎడ్ ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు మార్కెట్ సెంటర్లోని హిందూ కాలేజీ హైస్కూల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 515.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 862.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 56,801 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.1200, గరిష్ట ధర రూ.2400, మోడల్ ధర రూ.1800 వరకు పలికింది.

బ'కాసు'రులు

- కోర్టు కానిస్టేబుళ్ల అవినీతి పర్వం
- బాధితులను కాసుల కోసం పీడిస్తున్న వైనం
- పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): తీరని కష్టాలు.. ఎన్నెన్నో సమస్యలు.. న్యాయం కోసం కోర్టుకు వెళితే.. కాసుల వేటలో ఉన్న ఖాకీలు పీక్కు తింటున్నారు. డబ్బులిస్తే చాలు.. ఏ పనైనా తామే చక్కబెడతామని పేద, చిన్న, ధనిక అనే తేడా లేకుండా అందరినీ పీడిస్తున్నారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు. గుంటూరు జిల్లాలో కొందరు కోర్టు కానిస్టేబుళ్ల అవినీతిపై ఏకంగా పోలీసు ఉన్నతాధికారులకే ఫిర్యాదులు అందాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

- ఇటీవల కాలంలో ఒక కేసులో బాధితుడు కోర్టుకు వెళ్లాడు. గుంటూరు నగరంలోని వ్యాపార సముదాయాలు అధికంగా ఉన్న ఓ పోలీసుస్టేషన్ కోర్టు కానిస్టేబుల్ ఆ కేసును పర్యవేక్షిస్తున్నాడు. పలు పత్రాల సమర్పణలో తాత్సారం చేస్తుండడంతో బాధితుడు ప్రశ్నించాడు. ''మంచి చెడ్డలు'' చూడాలిగా అని కానిస్టేబుల్ చెప్పటంతో.. నేరుగా బాధితుడు కోర్టు కానిస్టేబుల్‌కు ఫోన్‌పేలోనే నగదు పంపాడు.
- ఈస్ట్ సబ్ డివిజన్‌లోని ఓ పోలీసుస్టేషన్ కోర్టు కానిస్టేబుల్ 17 సెల్‌ఫోన్ల రికవరీ కేసులో స్వాధీన సొత్తును బాధితులకు అప్పగించకుండా తన వద్దే ఉంచుకుని, ఒక ఎస్ఐతో కలిసి కైంకర్యం చేశారనే ఆరోపణలు ఉన్నాయి.
- కొద్ది రోజుల క్రితం గుంటూరు రూరల్ పరిధిలోని ఒక స్టేషన్ పరిధిలో కోడి పందేల స్థావరంపై దాడిచేసి 15 మందికిపైగానే పట్టుకున్నారు. అయితే వారి నుంచి రూ 1,000 చొప్పున తీసుకుని, కనీసం కోర్టుకు కూడా హాజరుపరచకుండా పంపివేశారని సమాచారం.
- గతంలో ఇదే కానిస్టేబుల్ కోడి పందేల అంశంలోనే ఒక వ్యక్తికి కోడిని మార్చి ఇచ్చేందుకు పెద్ద మొత్తంలో నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది.
- గుంటూరు నుంచి విజయవాడ రహదారిలో ఉన్న ఒక పోలీసుస్టేషన్‌లో ఒక కోర్టు కానిస్టేబుల్ ఆగడాలు శ్రుతి మించిపోతున్నాయి. గతంలో ఎప్పుడో కరోనా సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన కేసులో యువకుడు కోర్టుకు వస్తే.. కోర్టు విధించిన జరిమానా రూ.500 ఉంటే.. కానిస్టేబుల్ మాత్రం తనకు రూ.3,000 ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశాడు. బాధిత యువకుడిని దుర్భాషలూ ఆడినట్టు సమాచారం. ఇటీవల అదే స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడి చేసి పట్టుకున్న సొత్తును నిందితులకు ఇచ్చేయాలని కోర్టు ఆమోద పత్రాలు జారీ చేసినా.. భారీగా డబ్బులు గుంజుకుని ఇచ్చినట్టు తెలుస్తోంది.
- పేకాట, బహిరంగంగా మద్యం సేవించటం, ఇతర చిల్లర కేసుల్లో కోర్టు జరిమానాల కంటే.. కానిస్టేబుళ్ల జరిమానాలే అధికమైపోయాయని కొందరు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేరుగా న్యాయవాది ఫిర్యాదు

పలువురు కోర్టు కానిస్టేబుళ్ల అవినీతి కార్యకలాపాలపై ఒక న్యాయవాది పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మహిళలతోనూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని అందులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. మ్యూచువల్ అండర్ స్టాండింగ్‌తో బదిలీలు అయినా కోర్టు కానిస్టేబుళ్లుగానే వ్యవహరించేదుకు వీరు మొగ్గు చూపుతున్నారని న్యాయవాది ఆరోపించినట్టు పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

అవినీతికి పాల్పడితే సస్పెండ్ చేస్తాం

కోర్టు కానిస్టేబుళ్లు అవినీతికి పాల్పడితే ఉపేక్షించం. వారిని సస్పెండ్ చేస్తాం. స్పష్టమైన ఆధారాలతో బాధితులు ఫిర్యాదు చేయొచ్చు. కోర్టుకు వచ్చే బాధితులను ఇబ్బందులకు గురి చేస్తే సహించం, శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– ఆరిఫ్ హఫీజ్, ఎస్పీ, గుంటూరు

సిండికేట్‌గా ఏర్పడి..

జిల్లాలోని కోర్టు కానిస్టేబుళ్లు సిండికేట్‌గా ఏర్పడి.. వ్యవహారాలు కొనసాగిస్తున్నారని సమాచారం. ఉదాహరణకు ఒక స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా పని చేసిన వ్యక్తి.. ఏదైనా స్టేషన్‌కు బదిలీ అయినా.. తిరిగి అక్కడి కోర్టు వ్యవహారాలే చూసుకునే పరిస్థితులు అనేక స్టేషన్ల పరిధిలో ఉన్నాయి.

- ఈస్ట్ పరిధిలోని ఒక విభాగ కోర్టు కానిస్టేబుల్‌గా వ్యవహరించిన వ్యక్తిపై ఆరోపణలు రావటంతో అతన్ని వీఆర్‌కు పిలిచారు. ఈ క్రమంలో అతను తాను కోర్టు కానిస్టేబుల్‌గానే పని చేస్తానని అధికారినే ధిక్కరించి మెడికల్ సిక్‌లో వెళ్లిపోయాడు. తిరిగి విధుల్లోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే గుంటూరు రూరల్ పరిధిలోని ఒక స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా చేరి విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం.



చేనేత మగ్గాల షెడ్డును ప్రారంభిస్తున్న చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత, చేనేత జౌళిశాఖ కమిషనర్ నాయక్, ఎమ్మెల్యే ఆర్కే, ఆప్కో చైర్మన్ చిరంజీవి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

చేనేత కార్మికులకు ఉపాధి

- జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
- చేనేత మగ్గం షెడ్ల ప్రారంభం

మంగళగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పిస్తామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నగరంలోని రాజీవ్ గృహకల్ప ఆవరణలో నిర్మితమైన చేనేత మగ్గాల షెడ్లను సోమవారం చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత, చేనేత జౌళి శాఖ కమిషనర్ నాయక్, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అతిథుల చేత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తొమ్మిదో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలో అనేక రకాల కార్యక్రమాలు చేపట్టామని, అందులో భాగంగా నడక కార్యక్రమంతో పాటు చేనేత రంగ అభివృద్ధికి కృషి చేసిన వారిని సత్కరించినట్టు వివరించారు. 2015లో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 7ని జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని వెల్లడించారు. చేనేత కార్మికుల అభివృద్ధి కోసం క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎన్‌హెచ్‌డీపీ), కాంప్రెహెన్సివ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(సీసీడీపీ) ద్వారా రూ.1.10 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చొరవతో కార్పొరేషన్ నిధులు రూ.2.50 కోట్లతో మంగళగిరిలో ఆరు చేనేత మగ్గాల షెడ్లను నిర్మించి జాతీయ చేనేత దినోత్సవం రోజున ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వాక్ టూ వర్క్ కాన్సెప్ట్ ద్వారా చేనేత కుటుంబాలకు వసతి కల్పించడం అభినందనీయమన్నారు.

146 మందికి లబ్ధి

ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మంత్రిగా ఉండగా నగరంలోని ఎర్రచెరువులో 25 ఎకరాల్లో రాజీవ్ గృహకల్ప సముదాయాన్ని నిర్మించారని చెప్పారు. అందులోని ఖాళీ స్థలాల్లో చేనేత కార్మికుల కోసం మగ్గాల షెడ్లను నిర్మించాలని భావించారని, వైఎస్సార్ అకాల మరణంతో అది జరగలేదని, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత మగ్గాల షెడ్ల నిర్మాణం పూర్తిచేశారని ఆనందం వ్యక్తం చేశారు. మొత్తం 146 మంది చేనేత కార్మికులకు పూర్తి వసతులతో వ్యక్తిగత మగ్గాల షెడ్లను కేటాయించి అప్పగించినట్టు వివరించారు. చేనేతల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. నేతన్న నేస్తం ద్వారా కార్మికులకు ఏటా రూ.24 వేలు అందిస్తున్నట్టు వెల్లడించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం స్పందన, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్షాలాంటి కార్యక్రమాలను విస్తృత స్థాయిలో అమలు చేస్తోందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో మొదటి నుంచీ స్పందన కీలక భూమిక పోషిస్తోందన్నారు. స్పందన అర్జీల పెండింగ్ చాలా తక్కువన్నారు. పెండింగ్ అర్జీల పరిష్కారంలో ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుడు అర్జీలు నమోదు చేయడాన్ని మానుకోవాలని హితవుపలికారు. అనంతరం వచ్చిన 168 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, జిల్లా అధికారులు పరిశీలించారు.

మూడు నెలల నుంచి జీతాలు లేవు



ఇన్నర్ రింగ్ రోడ్డులోని క్యాప్ టావ్ ఏజెన్సీలో 30 మందిమి సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నాం. మాకు 3 నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా యాజమాన్యం వేధిస్తోంది. ఒక్కొక్కరికి నెలకు రూ.15 వేలు చొప్పును రూ.45 వేలు రావాల్సి ఉంది. కుటుంబాలు గడవడం కూడా కష్టంగా మారింది. మాకు న్యాయం చేయండి.

– సెక్యూరిటీ గార్డులు, గుంటూరు

పెన్షన్ పునరుద్ధరించండి



నా వయస్సు 76 సంవత్సరాలు. జగన్‌బాబు నాకు ప్రతి నెలా పింఛన్ డబ్బులు ఇస్తుండడంతో ఆ డబ్బుతో నేను మందులు కొనుక్కుంటున్నాను. నాకు ఇల్లు ఉందని ఈ జనవరి నుంచి ఆపేశారు. ఇప్పుడు చేతిలో చిల్లిగవ్వలేదు. మందులు వాడడం మానేయడంతో ఆరోగ్యం పాడయ్యింది. నా పింఛన్ పునరుద్ధరించండి

– దొంతా రత్తమ్మ, గుంటూరు

శావల్యాపురం స్టేషన్‌కు కొత్తసొబగులు

తుదిదశకు ప్లాట్‌ఫాం, పై వంతెన పనులు
గోదాం నిర్మాణానికి యత్నాలు



నూతనంగా ఏర్పాటు చేసిన పై వంతెన

శావల్యాపురం: కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రైల్వే స్టేషన్లకు మహర్దశ పట్టిన సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా రైల్వే స్టేషన్లు నూతన హంగులతో రూపు దిద్దుకుంటున్నాయి. శావల్యాపురం రైల్వే స్టేషనుకు కొత్తసొబగులు అద్దుతున్నారు. ప్రధానంగా ఈ స్టేషన్ జంక్షన్ కూడా కావడంతో కోట్లరూపాయల వ్యయంతో అభివృద్ధి పనులను రైల్వే అధికారుల పర్యవేక్షణలో సాగుతున్నాయి. శావల్యాపురం రైల్వే స్టేషనులో గూడ్స్ రైళ్ల రాకపోక లు పెరగటంతో పాటు రైల్వే ట్రాక్‌లు పెంచారు. నూతనంగా 1200 మీటర్ల ప్లాట్‌ఫాం, పై వంతెన పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులు ప్రస్తుతం తుదిదశకు చేరాయి. త్వరలో గూడ్స్ రైళ్ల నుంచి రవాణా అయ్యే ఎరువులు తదితర వాటిని నిల్వ ఉంచేలా గోదాం నిర్మాణ చర్యలకు రైల్వే అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నడికూడి–శ్రీకాళహస్తి రైల్వే పనులు శావల్యాపురం రైల్వే స్టేషన్ వరకు పనులు పారదర్శకంగా రైల్వే అధికారులు చేశారు. దీంతో గూడ్స్ రైళ్ల రాకపోకలు పెరగటంతో రైల్వేస్టేషన్ అభివృద్ధికి రైల్వే అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. అమృత భారత్ స్టేషన్ పథకంలో భాగంగా వినుకొండ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.12.4 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

స్టేషన్లలో ఆధునిక వసతులు

డివిజన్‌లో రైల్వే స్టేషన్లను అభివృద్ధి పరుస్తున్నాం. ఇందులో భాగంగా శావల్యాపురం స్టేషన్‌లో పనుల చేపట్టాం. అలాగే వినుకొండ రైల్వే స్టేషనులో రైల్వే ప్రయాణికులకు మౌలిక వసతులు, విశ్రాంతి గదులు, మహిళలకు ఏసీ, నాన్ ఏసీ గదులు ఏర్పాటు చేస్తున్నాం. ప్రయాణికులకు ఆధునిక వసతులు కల్పిస్తున్నాం. ఈ పనులు 2024 మార్చి నాటికి పూర్తవుతాయి.

– ఎం.రామకృష్ణ, రైల్వే డీఆర్ఎం, గుంటూరు

ఆడుకుంటూ నీటికుంటలో పడి..

నాలుగేళ్ల బాలుడి మృతి

కాకుమాను: తోటి చిన్నారులతో కలిసి ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ నీటికుంటలో పడి నాలుగేళ్ల బాలుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. ఈ హృదయ విదారక ఘటన కాకుమానులో సోమవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కాకుమాను బండపాలెంకు చెందిన పాగర్తి వెంకటేష్, భవానీ దంపతులకు ఇద్దరు కుమారులు. వీరు మండలంలోని పలు గ్రామాలలో ఉల్లిపాయలు ఇచ్చి పాత ఇనుప సామగ్రి సేకరించే వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే సోమవారం తమకున్న మూడు చక్రాల రిక్షాలో ఉల్లిపాయలతో వ్యాపారం కోసం చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లారు. ఈ సమయంలో వెంకటేష్ చిన్న కుమారుడు పాగర్తి పవన్ కుమార్(4) తోటి చిన్నారులతో ఆడుకుంటూ తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉన్న మల్ల కుంటలో ప్రమాదవ శాత్తూ పడిపోయాడు. గమనించిన తోటి చిన్నారులు కేకలు వేయడంతో గమనించిన చుట్టు పక్కల వారు వచ్చి పరిశీలించేసరికి వెంకటేష్ మృతి చెంది నీటిలో తేలడంతో బయటకు తీసి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న కాకుమాను జెడ్పీటీసీ సభ్యులు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ కానుగుల పరమేశ్వరరావు, గామ మాజీ సర్పంచ్ నన్నపనేని కిషోర్‌బాబు, కొండపాటూరి సుబ్బారావు, షేక్ అసదుల్లా చిన్నారి మృతదేహానికి పూల మాలల వేసి నివాళులు అర్పించి కుటుంబానికి అండగా ఉంటామని హామీఇచ్చారు.

గుంటూరులో అగ్నిప్రమాదం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్) : గుంటూరు నగరం కొత్తపేట అన్నా శ్రీనివాసరావు కల్యాణ మండపం పక్కన ఉన్న గో సంబంధిత సాంబ్రాణి కంపెనీలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. పొట్టి వాసుకు చెందిన ఈ కంపెనీ నుంచి మంటలు చెలరేగడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. హుటాహుటిన వచ్చిన ఫైరింజన్లు మంటలను అదుపు చేస్తున్నాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. నష్టం భారీగానే ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. మంటలు ఇతర దుకాణాలకు వ్యాపించకుండా అగ్నిమాపక శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

అబద్ధాల 'యువగళం'

- అసత్యాలు వల్లెవేస్తున్న లోకేష్
- అమాయక యువతను రెచ్చగొడుతున్నారు
- రైతుల పంట కాలువ ఆక్రమించిన జీవీ
- ఆధారాలతో నిరూపించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నారా లోకేష్ యువగళం పాదయాత్ర పేరుతో తిరుగుతూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, అమాయకపు యువతను రెచ్చగొట్టి కేసులు పెట్టించుకుంటే పదవులు ఇస్తామని, వారి జీవితాలను బలి చేయాలని చూస్తున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం బొల్లా విలేకరులతో మాట్లాడుతూ తాను ప్రభుత్వ భూమిని ఆక్రమించి బ్యాంక్‌లో తనఖా పెట్టి రూ.53 కోట్లు రుణం తీసుకున్నానని లోకేష్ చెప్పారని, అసలు తనకు ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లో ఖాతానే లేదని, బ్యాంక్ అధికారులు ఇచ్చిన నివేదికను చూపించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వినుకొండను రూ.2,400కోట్లతో అభివృద్ధి చేశామని, మాజీ ఎమ్మెల్యే జీవీ తన వెంటబడి నిధులు తెచ్చారని లోకేష్ అబద్ధాలు చెబుతున్నారని దుయ్యబట్టారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి ఏమిటో చూపించాలని బొల్లా ప్రశ్నించారు. రూ.2,400 కోట్లలో లోకేష్ వాటా ఎంతని అడిగారు. తనపై చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. వినుకొండకు వెటర్నరీ, పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరు చేస్తామని గతంలో చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని బొల్లా ప్రశ్నించారు. దమ్ముంటే వినుకొండలో తనపై పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు.

మాజీ ఎమ్మెల్యే జీవీ అక్రమాలపై విచారణ

మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆయన కుటుంబసభ్యులు, బినామీలు వినుకొండలో వందల ఎకరాలు ఆక్రమించారని, వీటిపై విచారణ జరుగుతోందని ఎమ్మెల్యే బొల్లా చెప్పారు. వినుకొండ సమీపంలో 251, 253, 249, 255 సర్వే నంబర్లలోని ఎస్ఎస్‌పీ పంట కాలువను ఆక్రమించి తన కుమారుడైన హరీష్ పేరుతో జీవీ గెస్ట్ హౌస్ నిర్మించారని ఆధారాలతో సహా వెల్లడించారు. గెస్ట్ హౌస్ పడగొట్టకుండా ముందస్తుగా కోర్టును ఆశ్రయించి జీవీ స్టే తెచ్చుకున్నారని, ప్రభుత్వ భూమి ఆక్రమించకపోతే కోర్టుకు ఎందుకు వెళ్లారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి తమ పార్టీ నేతల పేరుతోనే తనకు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు వేయించి నీచరాజకీయాలకు జీవీ తెరలేపారని, ప్రజలకు వాస్తవాలు తెలుసని బొల్లా స్పష్టం చేశారు.

సంగం డెయిరీ అక్రమాల్లో లోకేష్ వాటా ఎంత..?

సంగం డెయిరీ అక్రమాల ద్వారా ధూళిపాళ్ల నరేంద్ర దోచుకున్న రూ.వందల కోట్లలో లోకేష్ వాటా ఎంతని బొల్లా ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేష్ మాటలు నమ్మి అమాయక యువకులు భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని ఎమ్మెల్యే హితవుపలికారు. కార్యక్రమంలో ఈపూరు ఏఎంసీ చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, శావల్యాపురం ఎంపీపీ ముండ్లమూరి సుహాసినిఅనిల్‌కుమార్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్, కౌన్సిలర్ షకీలా దస్తగిరి పాల్గొన్నారు.

■ గుంటూరు మెడికల్: జిల్లాలో మిషన్ ఇంద్రధనస్సు- 5.0 మొదటి విడత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. సోమవారం కేవీపీ కాలనీలోని పీహెచ్‌సీలో వ్యాక్సినేషన్‌ను కలెక్టర్ ప్రారంభించారు.

రావులపాలెం ఘటనపై తాడేపల్లి పోలీసుల విచారణ

- గల్లంతైన సుహాసిని తన ఇద్దరు పిల్లలతో తాడేపల్లి క్రిస్టియన్ పేటలో ఉంటున్నట్లు నిర్ధారణ
- స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న మృత్యుంజయ లక్ష్మీసాయి కీర్తి
- పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామన్న సీఐ శేషగిరిరావు


సుహాసిని ఇంటి చుట్టుపక్కల వారిని విచారిస్తున్న తాడేపల్లి సీఐ

తాడేపల్లిరూరల్: మహిళను ఇద్దరు కుమార్తెలతో సహా గోదావరి నదిలోకి తోసిన ఘటనపై తాడేపల్లి పోలీసులు విచారణ చేపట్టారు. ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గోదావరి బ్రిడ్జి వద్ద జరగ్గా, బాధితురాలు తాడేపల్లి నివాసి కావడంతో ఇక్కడ విచారణ ముమ్మరం చేశారు. తాడేపల్లి సీఐ శేషగిరిరావు సోమవారం స్థానికంగా విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. గుడివాడకు చెందిన పప్పుల సుహాసిని (36), భర్తతో విభేదాలు ఏర్పడడంతో విడాకులు తీసుకుని తన పెద్దకుమార్తె లక్ష్మి సాయి కీర్తితో తాడేపల్లిలో నివాసముంటూ ఓ హోటల్‌లో పిండి రుబ్బడం, చట్నీలు వేయడం చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. ఈమెతో పాటు ప్రకాశం జిల్లా దర్శికి చెందిన సురేష్ ఆమె పనిచేస్తున్న హోటల్‌లోనే వంట మాస్టర్‌గా పనిచేస్తూ ప్రేమిస్తున్నానంటూ పదేపదే వెంటబడడంతో ఇద్దరూ సహజీవనం చేయసాగారు. వీరికి ఒక కుమార్తె కలిగింది. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో రెండు సంవత్సరాల నుంచి సుహాసిని తాడేపల్లిలోని క్రిస్టియన్‌పేటలో తన ఇద్దరు కుమార్తెలతో ఒంటరిగా నివాసముంటోంది. అక్కడ నివాసముండే వారికి ఎవరికీ పెద్దగా సుహాసిని వివరాలు తెలియదు. ఈ క్రమంలో శనివారం సురేష్‌తో కలసి కారులో బయటకు వెళ్లినట్లు ప్రాణాలతో బయటపడ్డ పెద్ద కుమార్తె లక్ష్మీసాయి కీర్తి పోలీసులకు చెప్పడం, సురేష్ తన తల్లిని, చెల్లిని, తనను బ్రిడ్జి మీద నుంచి నీటిలోకి తోసేశాడని, తాను పైప్ పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చానని చెప్పింది.

రెండేళ్లుగా క్రిస్టియన్‌పేటలో నివాసం

ఈ విషయాలు రావులపాలెం పోలీసుల ద్వారా తెలుసుకున్న తాడేపల్లి సీఐ శేషగిరిరావు తాడేపల్లి పట్టణ పరిధిలోని క్రిస్టియన్ పేటలో నివాసముంటూ గల్లంతైన సుహాసిని ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు, డీఎస్పీ రాంబాబు సూచనల మేరకు గల్లంతైన వారి వివరాల కోసం తాడేపల్లిలో విచారణ చేపట్టామన్నారు. సుహాసిని రెండు సంవత్సరాల నుంచి క్రిస్టియన్ పేటలోనే వనమా రాజేష్ ఇంట్లో నివాసముంటోందని, రాజేష్ కుటుంబం ఇబ్రహీంపట్నంలో నివాసముండడంతో వారికి కూడా పూర్తి వివరాలు తెలియదని, ప్రస్తుతం గత రెండు సంవత్సరాల నుంచి సుహాసిని తన ఇద్దరు కుమార్తెలతో నివాసముంటున్నట్లు స్థానికులు చెబుతున్నారన్నారు. మృత్యుంజయురాలైన లక్ష్మీ సాయికీర్తి తాడేపల్లి గేటు సెంటర్‌లో వున్న జిల్లా పరిషత్ పాఠశాలలో 7వ తరగతి చదువుతోందన్నారు. సుహాసిని శనివారం సాయంత్రం తన ఇద్దరు కుమార్తెలతో బయటకు వెళ్లినట్లు స్థానికులు చెప్పారన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామన్నారు. నిందితుడు సురేష్ ఆచూకీ కోసం రావులపాలెం పోలీసులతో కలసి తాడేపల్లి ప్రాంతంలో కూడా విచారణ చేపట్టామని గతంలో సురేష్ పలు హోటళ్లలో పనిచేశాడని, ప్రస్తుతం ఇక్కడ పనిచేయడం లేదని గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో సురేష్ ఆచూకీ లభిస్తే వెంటనే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ శేషగిరిరావు కోరారు.

చేనేతకు ప్రపంచవ్యాప్త గుర్తింపు

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి


చేనేత ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసి రాజకుమారి

గుంటూరు వెస్ట్: భారతీయ చేనేతకు చరిత్రలో ఉన్నత స్థానముందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. 9వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ర్యాలీని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యంత ఎక్కువగా ఆదరణ పొందుతున్న చేనేత రంగంలో లక్షల మంది ఉపాధి పొందుతున్నారన్నారు. మన చేనేతకు అంతర్జాతీయ గుర్తింపు ఉందని వివరించారు. స్వాతంత్య్ర సంగ్రామంలో విదేశీ వస్తువుల బహిష్కరణ, స్వదేశీ ఉద్యమానికి గుర్తుగా 1905లో కోల్‌కతాలో ప్రారంభించిన కార్యక్రమం చాలా కాలం కొనసాగిందన్నారు. 2015 తర్వాత భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని పేర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి ఎనలేని సహాయ సహకారాలందిస్తోందని పేర్కొన్నారు. నేతన్న నేస్తం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు అందిస్తోందని వివరించారు. మగ్గాల ఆధునీకరణ, ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోందని చెప్పారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ చేనేత రంగానికి ఆధునికీకరణ జోడించాలని పేర్కొన్నారు. చేనేత పరిశ్రమల స్థాపనకు విరివిగా రుణాలు కూడా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడి ఏడి వనజా, సివిల్ సప్‌లైస్ డీఎం జి.లక్ష్మి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

గుంటూరు వెస్ట్: ఆగస్టు 15వ తేదీన జరగనున్న స్వాతంత్య్ర దినోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక పోలీస్ పేరేడ్ మైదానంలో జరగనున్న ఈ వేడుకలను వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో నిర్వహించాలన్నారు. విధుల్లో అత్యంత ప్రతిభ కనబరుస్తున్న ఉద్యోగుల వివరాలను ఈ నెల 10వ తేదీలోపు కలెక్టరేట్‌కు పంపాలని చెప్పారు. డీఆర్వో చంద్రశేఖరరావు, జడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, డిప్యూటీ కలెక్టర్ లలిత, డీఈఓ శైలజ పాల్గొన్నారు.

ప్రభుత్వ జీఓలపై సమీక్ష సమావేశం

గుంటూరు ఈస్ట్: కొత్తపేటలోని దేవదాయ ధర్మాయ శాఖ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ జీఓలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మహేష్ మాట్లాడుతూ దేవదాయ శాఖ భూములను ఎంత వరకు వెబ్‌సైట్‌లో నమోదు చేసిందీ ప్రతి ఒక్క ఈఓ తెలియజేయాలన్నారు. ఎంత భూమికి 1బీ అడంగళ్లు ఉన్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంత భూమి నమోదు చేయాలో విచారించారు. అన్యాక్రాంతంలో ఉన్న ఇనామ్ భూములను ఆర్డీఓ సహకారంతో దేవదాయ భూములుగా క్లెయిమ్ పిటిషన్ ఫైల్ చేయాలన్నారు. అర్చకులకు ఎంత మందికి రైతు భరోసా అమలవుతోంది అడిగి తెలుసుకున్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

స్పందనలో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌కు బాధితుల మొర


బాధితుల సమస్య వింటున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, పక్కన ఏఎస్పీ శ్రీనివాసరావు

నగరంపాలెం: ప్రభుత్వ/ ప్రైవేటు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురు మోసగించారంటూ బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాల్లో చేరాలంటే రూ.లక్షల్లో చెల్లించాల్సి ఉందని నమ్మబలికారని, దీంతో దఫాల వారీగా దళారులకు లక్షల్లో ముట్టజెప్పామని, ఇప్పుడు ఉద్యోగాలు, డబ్బుల విషయమై అడిగితే, ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని బాధితులు వాపోయారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక- స్పందన (గ్రీవెన్స్) జరిగింది. అర్జీలను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ స్వీకరించి, సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి సోమవారం స్పందనకు వచ్చే ఫిర్యాదులను నిర్ణీత వేళల్లో పరిష్కరించాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. అది కూడా చట్ట పరిధిలో న్యాయం చేయాలని చెప్పారు. జిల్లాలోని సబ్ డివిజన్ల, పోలీస్‌స్టేషన్ల అధికారులతో మొబైల్ ఫోన్, జూమ్ ద్వారా మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, డీఎస్పీలు బాలసుందరరావు (ట్రాఫిక్), ఉమామహేశ్వరరెడ్డి (పశ్చిమ) అర్జీలు స్వీకరించారు.